
ఎమ్మెల్సీ కవితను కలిసిన గణేశ్

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్‌వీ నాయకుడు

కల్వకుర్తి, జనవరి 10 : నిజామాబాద్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను శుక్రవారం కల్వకుర్తి బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు, జాగృతి నాయకుడు గణేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. గణేశ్ వెంట జాగృతి జిల్లా నాయకుడు అనిల్ ఉన్నారు.

బాలబాలికల సంరక్షణకు న్యాయసేవలు

- జిల్లా జడ్జి రాజేశ్‌బాబు

మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజేశ్‌బాబు

నాగర్‌కర్నూల్, జనవరి 10 : సమాజంలోని బాలబాలికల సంరక్షణ కోసం స్నేహపూర్వకమైన న్యాయసేవలు అందించనున్నట్లు జిల్లా జడ్జి రాజేశ్‌బాబు అన్నారు. పిల్లల సంరక్షణకోసం న్యాయసేవలు అందించాలన్న లక్ష్యంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ(డీఎల్ఎస్ఏ) ప్రత్యేకమైన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు గురు, శుక్రవారాలు రెండురోజుల పాటు ఈ కమిటీలోని సభ్యులందరికీ వివిధ రకాల రిసోర్స్ పర్సన్స్ ద్వారా జేజేపీ యాక్ట్, పోక్సోయాక్ట్, సీడబ్ల్యూసీ కమిటీ బాధ్యతలు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సంస్థ బాధ్యతలను వివరంగా శిక్షణ ఇచ్చారు. దాల్సా నిర్వహణలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా, స్వచ్ఛందంగా పనిచేస్తూ జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఏఎస్పీ రామేశ్వర్‌రావు మాట్లాడుతూ చిన్నారులకు ఏ సందర్భంలోనూ చే తులకు హ్యాండ్స్ వేయవద్దని, రాత్రివేళల్లో స్టేషన్‌లో ఉంచుకోవడానికి వీలు లేదన్నారు. జేజేబీ బోర్డు సభ్యురాలు గిరిజ ప్రీతి మాట్లాడుతూ మూట సహాయం కాకుండా కేవలం మాట సహాయం చేసి సమాజంలోని పిల్లలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు.

సకాలంలో ఇంటి పన్ను వసూలు చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 10 : సకాలంలో ఇంటి పన్నులను అధికారులు వసూలు చేసి పట్టణాభివృద్ధికి సహకరించాలని పుర కమిషనర్ నరేశ్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటిపన్నులు వసూలు చేయడానికి కొన్ని టీంలను ఏర్పాటు చేశామని సకాలంలో వసూలు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అబ్దుల్‌సలాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

చోరీకి గురైన 104 సెల్‌ఫోన్ల రికవరీ

నాగర్‌కర్నూల్, జనవరి 10 : సాంకేతిక పరిజ్ఞానంతో చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసిన బాధితులకు అప్పగించినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులతో సమావేశమై వారి ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఇటీవల కాలంలో ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో 104 ఫోన్లను రికవరీ చేసిన వాటిని బాధితులకు అందజేశారు. టీమ్‌లో ఐటీకోర్ విక్రమ్, కానిస్టేబుల్స్ చిరంజీవి, జాకీర్, గుణశేఖర్ ఉన్నారు. ఈ సందర్భంగా వీరిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో జిల్లా డీసీఆర్‌బీ సీఐ ఉపేందర్‌రావు, ఎస్‌బీ సీఐ శ్రీనివాస్, ఐటీకోర్ సిబ్బంది విక్రమ్, పోలీస్‌స్టేషన్ల నుంచి పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో అగ్రస్థానంలో నిలవాలి

అచ్చంపేటటౌన్, జనవరి 10 : ఇంటర్ ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో నిలవాలని జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన అచ్చంపేట నియోజకవర్గంలోని కొండనాగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి మాట్లాడారు. ఇంటర్ విద్య ఉన్నత చ దువులకు పునాదిగా నిలుస్తుందని అందు కు విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ఇంటర్ ఫలితాలపై దృష్టి పెట్టాలన్నారు. మార్చి నెలలో జరిగే వార్షిక పరీక్ష ల్లో మంచి ఫలితాలను సాధించేందుకు విద్యార్థులకు సలహాలు సూచనలు చేశారు. అనంతరం కళాశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైదులు, అధ్యాపకులు శేఖర్, శోభారాణి, అనిత, సయ్యద్, ఆంజనేయులు, శ్రీను, మల్లేశ్, కృష్ణ, భార్గవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వంగూరు, జనవరి 10 : బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని సర్వారెడ్డిపల్లితండా సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై మహేందర్ కథనం మేరకు సర్వారెడ్డిపల్లి తండాకు చెందిన సభావట్ సందీప్(21)తన సోదరిని పికప్ చేసుకోవడానికి వీలుగా హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై వంగూరు గేటు వైపునకు బైక్‌పై వెళ్తుండగా వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేసు నమోదు

వెల్దండ, జనవరి 10 : మండలంలోని ఎంజీకాలనీ తండాలో కుటుంబ కలహాలతో ఘర్షణ పడ్డా ఘటనలో 8మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. ఎస్సై కథనం మేరకు ఎంజీ తండాకు చెందిన రాత్లవత్ సోని, రాంచందర్ కుటుంబాల మధ్య ఏర్పడ్డ కలహాలపై ఈనెల 5న మండల కేంద్రంలో చర్చించుకుంటుండగా ఘర్షణ పడి ఒకిరినొకరు గాయపర్చుకున్నారు. ఈ ఘటనపై పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాచందర్, శంకర్, నరేశ్, శారదలపై రాఘవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోని, పద్మ, జ్యోతి , శిరషలపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పాజిపల్లిలో ఐదు పశువులు చోరీ

తిమ్మాజిపేట, జనవరి 10 : మండలంలోని అప్పాజిపల్లిలో ముగ్గురు అన్నదమ్ములకు చెందిన ఐదు ఎద్దులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన చెట్టమోని వెంకటయ్య, చెట్టమోని తిరుపతయ్య, చెట్టమోని యాదయ్య రోజు మాదిరిగానే గురువారం రాత్రి గుమ్మకొండకు వెళ్లే దారిలో ఉన్న తమ వ్యవసాయ పొలాల వద్ద ఎద్దులను కట్టేసి ఇంటికి వచ్చారు. కాగా శుక్రవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లారు. వెంకటయ్యకు చెందిన మూడు, మిగిలిన ఇద్దరికి చెందిన ఒక్కొక్క ఎద్దులు కనిపించలేదు, సమీపంలో వాహనాల టైర్ల జాడలు కనిపించాయి. గ్రామ చివరిలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా రెండు కార్లు అక్కడికి వచ్చే వెళ్లినట్లు గుర్తించారు. కాగా బొలెరోల్లో ఐదు ఎద్దులను ఎక్కించి ఎత్తుకపోయి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేశారు. చోరీకి గురైన ఎద్దులు విలువ రూ.3లక్షల దాకా ఉన్నట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డప్పు కళాకారుల ర్యాలీ

తిమ్మాజిపేట, జనవరి 10 : మండల కేంద్రంలో డప్పు కళాకారులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఫిబ్రవరి 7 హైదరాబాద్‌లో వర్గీకరణ అమలుకోసం నిర్వహిస్తున్న వెయ్యిగొంతులు–లక్ష డప్పులు అనే కార్యక్రమంపై మాదిగలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు డప్పుస్వామి, ప్రదీప్, జగన్‌రా జ్, బాలరాజ్, సురేందర్, వెంకటయ్య, వెంకటేశ్, కాళ్లరాజు, రమాకాంత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే

ప్రజాభవన్ ముట్టడిస్తాం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలను ముట్టడించిన ఆశ కార్యకర్తలు

కల్వకుర్తి రూరల్ : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 10 : ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీని వెంటనే నిలుపుకోవాలని, సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాభవన్ ముట్టడిస్తామని సీఐటియూ జిల్లాప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ఆశ కార్యకర్తలు ముట్టడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రభుత్వం రూ.18వేలు చెల్లిస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన మాట తప్పిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలకు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని, ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్‌వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రామయ్య, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చెన్నమ్మ, ఉపాధ్యక్షురాలు వసుంధర, కృష్ణవేణి, వరలక్ష్మి, సువర్ణ, మానస, జయశ్రీ, లక్ష్మి, గౌరమ్మ ఉన్నారు.

రూ.18వేలు వేతనం ఇవ్వాలి

కొల్లాపూర్ రూరల్, జనవరి 10 : ఆశ వర్కర్లకు కానీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంప్ ఆఫీసు వరకు పాదయాత్రగా వెళ్లి మంత్రి క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కళావతి మాట్లాడుతూ పిక్స్‌డ్ వేతనంతోపాటు పీఎఫ్‌తో పాటు ఆశవర్కర్లలో ఏఎన్ఎం, జీఎన్ఎం చదివిన వారు ఉన్నారు. వారికి ప్రభుత్వ పోస్టుల్లో మెరిట్ కల్పించి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయుకుడు ఈశ్వర్ మాట్లాడుతూ ఆశవర్కర్ల పారితోషకం కాకుండా పిక్స్‌డ్ వేత్తనం రూ.18వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆశకార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం క్యాంప్ కార్యాలయం వద్ద మంత్రి లేకపోవడంతో సిబ్బందికి అశవర్కర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అశవర్క యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కళావతి, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి ఉన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తిరూరల్, జనవరి 10 : ఆశ కార్యకర్తలకు రూ.18వేలు ఫిక్స్‌డ్ జీతాన్ని అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఎన్నికల తర్వాత ఆశలు పలు విధాలుగా ఆందోళన చేపట్టగా వైద్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఆశలకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. అనంతరం డిమాండ్లను తెలియజేస్తూ మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్‌కు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిని అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పరశురాములు, జంగయ్య, స్వప్న, రఫీకాసుల్తానా, చంద్రకళ, నర్మద, సుభద్ర, వసంత, అనిత, సుజాత, విమల, మాధవి, కవిత, అనిత, గౌరి పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు

నాగర్‌కర్నూల్ టౌన్ : ధర్నాలో పాల్గొన్న శ్రీనివాసులు, ఆశ కార్యకర్తలు

ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై సమీక్ష

వెల్దండ, జనవరి 10 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై జెడ్పీ డిప్యూటీ సీఈవో గోపాల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రగతిపై సమావేశమై పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మణ్, సూపరింటెండెంట్ రేవంత్‌రెడ్డి ఉన్నారు.

మీసేవ కేంద్రాల ఏర్పాటుకు రాత పరీక్ష

నాగర్‌కర్నూల్, జనవరి 10 : జిల్లాలో ఏర్పాటు చేయనున్న మీ సేవా కేంద్రాల కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత పరీక్ష నిర్వహించారు. కొల్లాపూర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న మీ సేవా కేంద్రం ఏర్పాటుకు కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ ప ర్యవేక్షణలో రాత పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 11 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ శోభ, మీసేవా సూపరింటెండెంట్ చెన్నకిష్టన్న, ఈడీఎం నరేశ్, ఆర్ఐ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

18న హజ్ శిక్షణా శిబిరం

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 10 : జిల్లా కేంద్రంలో ఈనెల 18తేదీన రూబి గార్డెన్‌లో హజ్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని హజ్ యాత్రికులు ఈ శిక్షణా శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఖతీబ్ తస్లిం అన్సారి హజ్ యాత్రలో అవలంభించాల్సిన పద్ధతులను వివరిస్తారని ఆయన తెలిపారు. ఎంపికైన హజ్ యాత్రికులు అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్‌కు చెందిన వారు ఉదయం 10 గంటలకు శ్రీపురం రోడ్డులో రూబి గార్డెన్‌లో నిర్వహించే శిబిరానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

కల్వకుర్తి రూరల్, జనవరి 10 : డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఓ వ్యక్తికి కల్వకుర్తి సివిల్ కోర్టు న్యాయమూర్తి కావ్య రెండు రోజుల జైలుశిక్షను విధించినట్లు ఎస్సై మాధవరెడ్డి శుక్రవారం తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా కల్వకుర్తి పట్టణం ఇందిరానగర్ చెందిన నవీన్ డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడగా శుక్రవారం కల్వకుర్తి కోర్టు అతడికి 2రోజుల జైలుశిక్ష రూ.వంద జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

రియల్ ఎస్టేట్ గుప్పిట్లో ప్రభుత్వ భూమి

- కలెక్టరేట్‌లో పరిపాలన అధికారికి వినతి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

కలెక్టరేట్‌లో అధికారికి వినతి పత్రం అంజేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్, జనవరి 10 : అచ్చంపేట పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డువైపు ఈద్గా వద్ద ఉన్న ప్రభుత్వ భూమి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ప్రైవేట్ వ్యక్తుల పేరా భూమిని పట్టా చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, సభ్యులు దేశ్యానాయక్, కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారికి చంద్రశేఖర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అచ్చంపేట పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డు ఈద్గా వద్ద ఉన్న సర్వే నెంబర్ 293లో 4ఎకరాల 32గుంటల భూమి 13దాకా ప్రభుత్వ భూమి అధికారికంగా రికార్డుల్లో నమోదు ఉందని ఆ భూమిని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి కొందరు రియల్ ఏస్టేట్ దారు లు అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని పేర్కొన్నారు. కోట్ల విలువ గలిగే ప్రభుత్వ భూమిని కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ చేసి ఆ స్థలాన్ని కాపాడాలన్నారు. ప్రభుత్వ భూమిని అధికారులు రక్షించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆ భూమిని స్వాధనపర్చుకుని నిరుపేదలందరికీ గుడిసెలు వేయిస్తామని అధికారులను వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, లక్ష్మణ్, శివవర్మ, తారాసింగ్, మధు, సయ్యద్, సురేశ్, బాలునాయక్, కుర్వమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

కల్వకుర్తి రూరల్ : బహుమతులను అందజేస్తున్న గ్రామస్తులు

కల్వకుర్తిరూరల్/వెల్దండ/పెద్దకొత్తపల్లి, జనవరి 10 : కల్వకుర్తి, వెల్దండ, పెద్దకొత్తపల్లి మండలాల్లోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులు సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగులతో అందమైన ముగ్గులను తీర్చిదిద్దారు. సంక్రాంతి పండుగలో భాగంగా హరిదాసుల పాటలు, గొబ్బెమ్మల ప్రాధాన్యత, భోగి, కనుమ, సంక్రాంతి పర్వదిన విశిష్టతను పాఠశాలల హెచ్ఎంలు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థు లు చక్కటి వేషాధారణలతో నిర్వహించిన నృత్యాలు, స్కిట్‌లు, శాస్త్రీయ నృత్యాలు, పతంగుల ఎగురవేత కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, వెల్దండ తక్షశిల పాఠశాలలో చిన్నారులు అందమైన రంగవళ్లులు తీర్చిదిద్దారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని లిటిల్ బడ్స్ స్కూల్‌లో ముగ్గులతోపాటు, గ్రామీణ వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లు చేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుంపర సేద్యంతో అధిక దిగుబడి

అచ్చంపేటరూరల్, జనవరి 10 : తక్కువ నీటి తుంపర సేద్యంతో పంటల అధిక దిగుబడిని సాధించవచ్చని స్పెయిన్ విజిటర్ మేడం బ్లాంకా అన్నారు. శుక్రవారం మండలంలోని సింగారంలో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 94 మంది పేద రైతులకు ఉచితంగా 25పైపులు 8 స్ప్రింకర్ నల్లాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో అనంతపూర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనాథ్, సిబ్బంది గోపాల్, సుధాకర్‌రెడ్డి, వరుణ్, కంపెనీప్రతినిధులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

లింగాల, జనవరి 10 : మండల కేంద్రానికి చెందిన ఎన్.నిరంజన్ గ్రామ శివారులోని తన పొలం వద్ద ఏర్పాటు చేసిన వరి గడ్డివాముకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డి దగ్ధమైంది. దీంతో రూ.15వేలు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

చైర్మన్‌కు సన్మానం

బల్మూరు, జనవరి 10 : గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేందర్‌ను శుక్రవారం మండలంలోని కొండనాగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కళాశాల అభివృద్ధికి అన్నివిధాల సహకరించాలని వారు చైర్మన్‌ను కోరారు.

గట్టుకాడిపల్లిని గ్రామపంచాయతీగా చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామస్తులు

ఉప్పునుంతల, జనవరి 10 : మండలంలోని గట్టుకాడిపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులు జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. గట్టుకాడిపల్లి గ్రామం ఏర్పడి ఎన్నో సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు ఉప్పునుంతల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నదని, 340కి పైగా ఓటర్లు ఉన్నా ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వంలో నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపడం జరిగిందని, అదేవిధంగా గ్రామం పేరు గట్టుకాడిపల్లి అని రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్థులు చదువుకునే సర్టిఫికెట్‌లో ఉందని, అయితే విద్యార్థులకు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేస్తున్నప్పుడు మాత్రం గ్రామం పేరు నర్సింగాపూర్ గ్రామం పేరు వస్తుందన్నారు. అలాంటి సమయంలో అధికారులు మీ గ్రామం ఆన్‌లైన్‌లో లేదని రిజెక్ట్ చేస్తున్నారని పేర్కొన్నారు. కావున అధికారులు తమ గ్రామాన్ని గట్టుకాడిపల్లి గ్రామంగా ఉండే విధంగా ఆన్‌లైన్ మార్పిడి చేయాలని, గట్టుకాడిపల్లిని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రావు, గోపాల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, తిరుపతయ్య, రాజశేఖర్, రమేశ్, శంకరయ్య, గోవింద్, కుర్మయ్య, జైపాల్‌రెడ్డి, పార్వతి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నిర్మాణ పనులు పరిశీలన

పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

కల్వకుర్తి, జనవరి 10 : కల్వకుర్తి మున్సిపాలిటీ విద్యానగర్ కాలనీలోని కాశీం ట్యాంకు వద్ద అమృత్ 2.0లో భాగంగా నిర్మిస్తున్న మిషన్ భగీరథ బ్యాంకు నిర్మాణ పనులను శుక్రవారం కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరిశీలించారు. నాణ్యతగా పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు రాఘవేందర్‌గౌడ్, తాహెర్‌అలీ, మల్లేశ్ ఉన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన కల్వకుర్తి విద్యార్థిని

ఆరాధ్యను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కల్వకుర్తి, జనవరి 10 : కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఆరాధ్య జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. జూనియర్ కళాశాలలో ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్న ఆరాధ్య ఈనెల 17, 18వ తేదీల్లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన ఆరాధ్యను శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంరెడ్డి, బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షుడు కిశోర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేణయ్య, అధ్యాపకులు సదానందం, రమాకాంత్, మల్లేశ్, రాజేశ్, భీమేశ్, లక్ష్మీకాంత్ సాగర్, జుబేర్, బాలరాజు, పరశురాం, లక్ష్మయ్య, నర్సింహులు, హైమద్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు

వెల్దండ, జనవరి 10 : క్రీడల వల్ల వ్యక్తులు, గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని బీఆర్ఎస్ మండల నాయకుడు అంజీనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపూర్‌లో నారాయణపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను చెర్కూర్ మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తారసింగ్, లక్ష్మీపతి, శ్రీను, నర్సింహ, గోపి, రఘు, రంజిత్ తదితరులు ఉన్నారు.

అవోపా అధ్యక్షుడుగా ప్రేమ్‌కుమార్

కొల్లాపూర్, జనవరి 10 : మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అవోపా జిల్లా అధ్యక్షుడు కోదండరాములు సమక్షంలో అవోపా నియోజకవర్గ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అవోపా నియోజకవర్గ అధ్యక్షుడుగా ప్రేమ్‌కుమార్, కార్యదర్శిగా రవి, కోశాధికారిగా నరేందర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, ప్రదీప్, రంగయ్య, రాజేందర్, నాగిశెట్టి, కార్యదర్శులుగా శివయ్య, నరేశ్, జగన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నాట్లు కోదండ రాములు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు శేషయ్య, సుదర్శన్ ఉన్నారు.

తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారానికి అంజి ఎంపిక

ఉప్పునుంతల, జనవరి 10 : మండలంలోని మామిళ్లపల్లికి చెందిన గద్దె అంజి మాస్టర్ జాతీయ పురస్కరానికి ఎంపికయ్యారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు 2025 పురస్కరించుకొని తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారానికి గద్దె అంజిని ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ ఆఫ్ జాతీయ చైర్మన్ రాజకుమార్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రోగ్రాం సమన్వయకర్త రాధికలు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యంలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చినందుకుగానూ కోలాట కళారంగంలో విశేష కృషి చేసినందుకు రాష్ట్రస్థాయిలో కోలాటం బృందాలు ఏర్పాటు చేసి ఎన్నో ప్రదర్శనలు ఇవ్వడం చేత జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు వారు ప్రకటించారు. ఈ నెల 11న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ త్యాగరాయ గణ సభలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

విజయవంతమైన వైద్య శిబిరం

కల్వకుర్తి రూరల్ : పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

కల్వకుర్తి రూరల్, జనవరి 10 : కల్వకుర్తి మం డలం తర్నికల్ తండాలో మహిళ దవాఖాన వైద్యురాలు యశోదబాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పలు అంశాలను వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు సోమ్లానాయక్, రాజు, గూండ్యా, లక్ష్మణ్, సక్రు, వైద్యుడు సురేశ్, సిబ్బంది కిరణ్, అజహర్, ప్రేమ్, శివ, నరేశ్, కర్ణాకర్, నాను, గీత, మేరి, దామిని పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

అచ్చంపేటటౌన్, జనవరి 10 : అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. దాదాపు ప్రభుత్వ కళాశాలలో మొత్తం 250 మంది విద్యార్థినులను వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీబీఎం వ్యవస్థాపకురాలు డాక్టర్ అనురాధ, డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్, లయన్స్ క్లబ్ సీనియర్ మెంబర్ నర్సింహారావు, బాలాజీ, నరేశ్, వినోద్, వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆశ వర్కర్స్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలి

చారకొండ, జనవరి 10 : విద్యారంగ అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ చారకొండ వెంకటేశ్‌కు సర్పంచుల సంఘం మాజీ మండలాధ్యక్షుడు నరేశ్‌నాయక్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చారకొండ వెంకటేశ్‌కు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మండలంలో ఇంటిగ్రేటెండ్ గురుకులంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు.